

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### డేగ రెక్కల చప్పుడు

"ప్రథమంగా నన్ను పిలిచారు, కుడి చేతిని ఎడమ కాలికి కట్టేసారు. ఒకరు నా కుడి మోచేతి దగ్గరా, మరొకరు పిడికిలి దగ్గరా పట్టుకున్నారు. వాళ్ళు చాలా తాపీగా, ఫ్యాక్టరీల్లో రోజూ పని చేస్తూ అలవాటైన వారిలా ఆ పని చేస్తున్నారు. 'తొందరగా పూర్తి చెయ్యండి అని వేడుకున్నాను.' ఒంటె మెడ కోసే కత్తిని ఒకడు బలంగా గాలిలో పైకి ఎత్తాడు. అంతకు ముందే భుజం దగ్గర తాడుతో గట్టిగా కట్టేసి, రక్తప్రసరణ ఆపుచేశారు. ఆ తరువాత భుజం కాస్త కిందుగా వేటు వేసాడు. నా కుడి చెయ్యి ఎగిరి దూరంగా పడింది. రక్తం జివ్వున ఎగజిమ్మింది. నేల మీదపడిన నా చేతి వేళ్ళు కాస్త కొట్టుకుని ఆగిపోయాయి. బలంగా కేక వేసాను. దాంతో పాటు మరో కేక కూడా వినిపించింది. అది ప్రేక్షకుల్లో ఉన్న అమ్మది. ఎడమ కాలు ఖండిస్తూ ఉండగా నాకు స్పృహ తప్పింది.

పదిహేనురోజుల తర్వాత ఆల్ - షబాబ్ మిలటరీ చీఫ్ వచ్చి మమ్మల్ని చూసాడు. సగం వరకూ ఖండించబడిన నా కాలు ఎత్తి పట్టుకున్నాడు. చివర చెయ్యి పెట్టి, మూడు వేళ్ళు పైకి కొలత చూపించాడు. అప్పుడు నాకు అర్ధమయింది. శాస్త్ర శిక్ష ప్రకారం కంటే నా కాలు మూడు అంగుళాలు కిందగా కత్తిరించబడింది. 'పొరపాటు జరిగింది. మతన్యాయం ఒప్పుకోదు' అంటున్నారు.

ఈసారి కత్తికాకుండా రంపం తెచ్చారు. కుళాయి పంపులు కత్తిరించే రంపం అది. గాయం ఇంకా పచ్చిగానే ఉంది. ఈసారి వారు పొరపాటు చెయ్యదలుచుకోలేదు. మరో నాలుగు అంగుళాలు పైగా మార్కు పెట్టి, ఒక దూలాన్ని కోసినట్టు పరపరా కొయ్యసాగారు. నాకు మత్తు కూడా ఇవ్వకపోవడంతో విలవిలా కొట్టుకున్నాను. ఎముకని కోస్తుండగా బాధ భరించలేక స్పృహ తప్పింది."

సొమాలియాలో చదువుకుంటున్న పదహారేళ్ళ కుర్రవాడు సైన్యంలో చేరడానికి సంసిద్ధత చూపించకపోవడంతో ఆల్ షబాబ్ అనే మతపరమైన సంస్థ విధించిన శిక్ష ఇది. ఇలా కాలూ చెయ్యీ కత్తిరించిన కుర్రవాళ్ళని ఆల్షబాబ్ ఆత్మాహుతీ దళాలుగా తయారు చేస్తుంది. శరీరానికి బాంబులు కట్టుకుని ఆఫీసుల్ని పేల్చెయ్యటం ఈ దళాల పని. ఒప్పుకున్నట్లు నటించిన అబ్దుల్లా ట్రైనింగ్ సమయంలో తప్పించుకుని, దేశరాజధాని మొగదిషు చేరుకుని, రెడ్ క్రాస్ ద్వారా కృత్రిమ అవయవాలు పొంది, ఆ తరువాత గార్డియన్ పత్రికకి ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఇదీ అబ్దుల్లా కథ.

'డేగ రెక్కల చప్పుడు' అన్న యండమూరి వీరేంద్రనాథ్ గారి నవలలో ఇది ఒక చిన్న పిట్ట కథ మాత్రమే!

ఒకప్పుడు రష్యన్లు ఆఫ్ఘన్‌ని ఆక్రమించుకుని రాజ్యమేలారు. అది అమెరికాకి నచ్చక, ఆఫ్ఘన్ పక్క దేశమైన పాకిస్తాన్‌ని ప్రోత్సహించింది. తన వంతు ధర్మంగా పాకిస్తాను 'తాలిబాన్' విప్లవ కారుల సాయంతో ఆ దేశంలో అలజడులు రేపింది. రష్యన్లు ఆ దేశం వదిలేసి పోయాకా తాలిబన్లు అధికారంలోకి వచ్చారు. వారు మతఛాందసవాదులు. మతం తప్ప ఈ ప్రపంచంలో వేరొకటి వారికి తెలియదు. వారికి తెలిసినవి రెండే ఆకలీ, అసహనం. తెలియనవి రెండే విశ్రాంతి, శత్రువుల పట్ల జాలీ. వారు స్త్రీలకి విద్య నిషేధించారు. ముసుగు లేకుండా సంచరిస్తే శిక్షించారు. గాలిపటం ఆకాశంలోకి ఎగరవెయ్యటం దేవుడ్ని పరిహసించటం అని పతంగులు నిషేధించారు. చెస్ ఆడడం, ధూమ పానం, సినిమా చూడటం, టీ.వీ వీక్షణం, మ్యూజిక్ వినటంలాంటి వాటికి కఠిన శిక్షలు. స్త్రీకి ఎత్తు చెప్పులూ, గోళ్ళరంగులూ, పరాయి పురుషుడితో కలిసి తిరగడం, వారు భర్త కానీ తండ్రి కానీ కాకపోతే వాహనంలో పక్కన కూర్చోవడం అన్నీ నిషిద్ధాలు! అందుకు శిక్షలు దారుణాలు. నియమాలకి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే రాళ్ళతో కొట్టి చంపడం వారికి శిక్ష!

తాలిబన్ నాయకుడు ముల్లా ఒమర్. ఆల్‌కైదా నాయకుడు బిన్‌లాడెన్. అమెరికానీ, భారత దేశాన్నీ నాశనం చెయ్యడమే బిన్ లాడెన్ ఆదర్శం! అతడిని రక్షించుకోవడమే తాలుబన్ల ఆశయం!

భారతదేశానికి ఆటంబాంబు తయ్యారు చెయ్యడానికో లేక కరెంట్ సమస్య శాశ్వతంగా రూపుమాపడానికో 'నేను చదువుకుంటానమ్మా' అని పేచీ పెట్టిన చిన్నపిల్లవాడు, ఆ చదువు కోసం జీవితాన్ని పణంగా పెట్టి ప్రముఖ శాస్త్రజ్ఞుడిగా ఎదిగి 'పద్మశ్రీ' తెచ్చుకున్నాడు. అతనే పద్మశ్రీ సారంగపాణి.

అతన్ని చాకచక్యంగా ఎత్తులతో, కుట్రలతో తమ వైపు తిప్పుకుని ఆటంబాంబు తయ్యారు చేయించడానికి ఒప్పించిన లాడెన్‌కి అతను ఒక షరతు పెట్టాడు. అతనికి ఒక రక్షణ శాఖ నుండి ఒక ఫైలు తెప్పించి పెడితేకానీ ఆ పని చెయ్యలేనని. అందుకు అక్కడ సెక్యూరిటీ ఆఫీసర్ పోలికలున్న కుర్రవాడిని పట్టుకుని, భరద్వాజ్‌ని చంపేసి, అతని స్థానంలో ప్రవేశపట్టి ఫైలు సంపాదించాలని వ్యూహం పన్నిన బుకారీ, లాడెన్‌లకి ఆ పోలికలున్న వ్యక్తి దొరికాడు. అతనే రామకృష్ణ శాస్త్రి. భారతదేశపు సైన్యంలో పని చేసి వచ్చాడు. అతని తల్లీ తండ్రీ మరణించారు. ఉన్నదల్లా ప్రేమించి పెళ్ళిచేసుకోడానికి సిద్ధంగా ఉన్న వైదేహి ఒక్కత్తె!

అటువంటి రామ్ గురించిన సమాచారం లాడెన్‌కి అందింది. నవలా ప్రారంభంలో..

"నీ పేరు?"

"ఆల్ కతబ్ ఫక్తూన్" అన్నాడు రామకృష్ణశాస్త్రి.

"పత్తా?"

ఆఫ్ఘన్ సరిహద్దుల్లో పాస్ పోర్ట్‌ని పత్తా అంటారు.

"ఎక్కడ్నుంచి వస్తున్నావ్?"

"పెషావర్"

"ఇక్కడ ఎందుకు పనిచేద్దాం అనుకుంటున్నావ్?"

"ఇక్కడ మతాన్నీ నియమాల్నీ, కఠినమైన చట్టాల్నీ మా దేశంలో స్థాపించటం కోసం"

"మీ దేశం కోసం మా దేశపు సైనికుడిగా చేరతావా?"

"నేను దేశాల తరపున పోరాడను. భగవంతుడి తరపున పోరాడను. భగవంతుడి తరపున పోరాడతాను"

అని భయంకరమైన దయారహితమైన మతమౌఢ్యంలో ప్రజల ప్రాణాల్ని గడ్డిపరకల్లా పరిగణించి చంపే క్రూరమైన సంస్థల మధ్యన ఒంటరి యోధుడై అడిగిడాడు రాం. ఎందుకు?

క్షణ క్షణం ప్రాణ గండం.. శవాల గుట్టల మధ్య ప్రమాదపు అంచున ప్రయాణం.. దేశాలు యుద్ధం చెయ్యాలంటే ప్రభుత్వ ఉత్తర్వులు ఉండాలి. సైనికుడు చెయ్యాలంటే అక్కర్లేదు. సైన్యం చెయ్యలేని పని. ఒక సైనికుడు చెయ్యగలడు! అందుకు రామకృష్ణశాస్త్రి నడుం కట్టాడు.

కార్గిల్ యుద్ధం గెలిచిన తరువాత మన సైన్యం అదే ఊపుతో ఆక్రమిత కాశ్మీరుని కూడా గెలవాలనుకుంది, కానీ ప్రభుత్వ ఉత్తర్వు లేదు. ఆగిపోవాల్సి వచ్చింది.

సైన్యం చేసే ఫిరంగి చప్పుళ్ళు లేని యుద్ధం ఒంటరి సైనికుడు నిశబ్దంగా పూర్తి చేసాడు. డేగ రెక్కలకు చప్పుడు ఉండదు. ఎందుకో తెలుసా? చప్పుడుంటే అది పట్టుకునే లోపు పాముకలుగులోకి దూరిపోతుంది.

ఈ దేశంలో జలయజ్ఞాల పేరిట కాంట్రాక్టర్లు కోట్లు గడిస్తారు. ఈ దేశంలో అధికారం కోసం రాజకీయనాయకులు కులతత్వాన్ని పోషిస్తారు. ఇక్కడ క్రికెట్ ఆటలో కోట్లకి కోట్లు కుంభకోణాలు జరుగుతాయి. లంచం లేనిదే అధికారులు పని చెయ్యరు. దేశం కన్నా వ్యక్తిగత లాభం ముఖ్యం అనుకునే అధికారులు సైన్యంలోనూ ఉన్నారు.

సరిహద్దు వాకిళ్ళు తెరిచి మిలటెంట్లని లోపలకి వదిలెయ్యటానికి. పాకిస్తాన్ ప్రభుత్వం భారత సెక్యూరిటీ గార్డ్స్‌కి అరగంటకి ముప్పై లక్షల రూపాయలు ఇస్తుంది.

ఇలాంటి గడ్డమీదే రామకృష్ణశాస్త్రిలాంటి దేశభక్తులూ ఉంటారు!

రామకృష్ణ గఫర్‌ఖాన్‌తో చెప్పిన సమాధానం ఇది. "ఇదంతా నేను మన దేశం కోసం చేస్తాను. తాలిబన్లను లాడెన్‌నీ రూపుమాపుతానని బరువైన మాటలతో చెప్పను. కానీ ఈ దేశంలో పుట్టటం నా అదృష్టంగా, ఈ దేశాన్ని రక్షించటం నా కర్తవ్యంగా భావిస్తాను. అదృష్టం ఎందుకంటారా? అమెరికాలో అన్నీ ఉంటాయి. అనుభవించడానికి సమయం ఉండదు. సోమాలియాలో సమయం ఉంటుంది. తినడానికి అన్నం ఉండదు. పాలస్తీనాలో ప్రాణం ఎప్పుడు పోతుందో తెలీదు. సౌదీలో ఎవరి వేళ్ళు ఎప్పుడు కత్తిరిస్తారో తెలీదు. ఈ మాత్రం జీవిత భద్రత కోసం. ప్రపంచంలో సగం మంది ఎదురు చూస్తున్నారనటంలో ఆశ్చర్యమేమీ లేదు. అంత గొప్పది మన దేశం."

బయట నుండి పడవల్లో వచ్చి మన హోటళ్ళ మీదా, గోకుల్ చాట్లలో సామాన్యుల మీదా, సినిమా హాళ్ళలో బాంబులు వేసి విధ్వంసం చేస్తాయి ఈ దుష్టశక్తులు. మనం వాళ్ళని ఏమీ చెయ్యం. పట్టుబడిన వాళ్ళని అరెస్ట్ చేస్తాం అంతే. పుట్టల్ని ధ్వంసం చెయ్యాలి! కార్గిల్ యుద్ధం గెలిచాకా ఆ జీపులో వెళ్ళి అక్రమిత కాశ్మీర్‌ని కూడా గెలవాలని సైన్యం ఉవ్విళ్ళూరింది. ప్రభుత్వం వద్దని ఉత్తర్వులు జారీ చేసింది. సైన్యం చేస్తూ సామాన్యుల బ్రతుకుని కాళరాత్రులకి బలి చేస్తున్న ఉగ్రవాద సంస్థల్నీ, వాటి చీకటి భాగస్వాముల్నీ, పెంచి పోషిస్తున్న ప్రభుత్వాల్నీ, స్వార్థ పూరిత రాజకీయాల్నీ, వేళ్ళు పూనిన మత ఛాందసాల్నీ, మనిషిలోని కరడు కట్టిన స్వార్థాన్నీ మన వెన్ను జలదరించే విధంగా అద్దంలో చూపించే నవల ఈ 'డేగ రెక్కల చప్పుడు'

నాయకులు ఎవరూ స్వయంగా ప్రమాదంలోకి దూకరు. యువకులని భావిస్తారు.

"నీకు ఈ దైవకార్యానికి అవకాశం వచ్చింది మా కన్నా నువ్వే అదృష్టవంతుడివి" అన్న మాటలతో మాయ చేసి తోస్తారు.

జనం కన్నా దైవం ముఖ్యం అనే ఈ చాంధసుల నాయకులు చచ్చినా, ఈ ఉగ్రవాద సంస్థలు చావవు!

'బిన్ లాడెన్ మరణం ఆల్‌ఖయిదా సంస్థకి పెద్ద దెబ్బ. అంతేకానీ అది అంతం కాదు! ప్రపంచం ఉన్నంత కాలం టెర్రరిజానికి అంతం ఉండదు . అన్న వీరేంద్రనాథ్ గారి ముందు మాట భయంతో పాటు నిస్తేజాన్ని కలిస్తుంది.

మనకి తెలీని ఆఫ్ఘనిస్తాన్ చరిత్ర, తాలిబన్ల ఆవిర్భవం, వారి దేశపు భౌగోళిక పరిస్థితులూ, ఆ ఆచార వ్యవహారాలు. కఠిన శిక్షలూ, కఠోరనియమాలూ, దేశాల అధికార దాహం, అంతర్గత పోరూ, కుట్రలూ, హత్యలూ, దానిలో బాటు దేశభక్తీ, దైవ భక్తీ.. ఇవన్నీ అరటి పండు ఒలిచినట్లు చూపించారు శ్రీ యండమూరి వీరేంద్రనాథ్.

ఎన్నో తెలీని చీకటి వాస్తవాలకి దర్పణం లాంటి ఈ నవల ప్రతి ఒక్కరూ చదివి తీరాల్సిన పుస్తకం!

ప్రతి పౌరుడూ చదివి నేర్చుకో వలసినవీ. ఆచరింపదగినవీ ఇందులో అడుగడుగునా కనిపిస్తాయి.

వీరేంద్రనాథ్ పోటీ లేని పాపులర్ రచయితగా ఎలా కాగలిగారో మరోసారి నిరూపించిన నవల ఈ **'డేగ రెక్కల చప్పుడు'**

ఈ పైన రాసిన ప్రతి వాక్యం శ్రీ వీరేంధ్రనాధ్ గారి కలం నుండి వచ్చినవే . అవి నేను అనుకూలంగా వాడుకుని మీకు నవలని పరిచయం చేసే ఓ చిన్ని ప్రయత్నం ఇది.

●●●

Click here to share your comments on this serial

Click here to read KOUMUDI review on Dega Rekkala Chappudu

